పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- ఆయుష్మాన్ భవపై అవగాహన

నందిగామ టౌన్: నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆయుష్మాన్ భవపథకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నాణ్యమన వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆయుష్మాన్ భవ కార్డులతో పేతలకు రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించటం జరుగుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భవ కార్డులకు గ్రామాల్లో ఏఎన్ఎంల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ కార్డు ఆరోగ్య శ్రీ ఉన్న ప్రతి ఆస్పత్రిలో చెల్లుబాటు అవుతుందని చెప్పారు. ఆయుష్మాన్ భవ కార్డుతో దేశంలో ఎక్కడైనా ఉచిత వైద్యం పొందవచ్చన్నారు. ముఖ్యంగా దీర్ఘకలిక వ్యాధులకు ఆయుష్మాన్ భవ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని పట్టణం, గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పాములపాటి రమేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 3,14 వార్డుల్లో చేపడుతున్న డ్రెయిన్లు, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రూ. 25 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నామన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతాక్రమంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డుల వారీగా డ్రెయిన్లు నిర్మించి మురుగు నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కమిషనర్ జయరాం, ఏఈ ఫణిశ్రీనివాస్, నాయకులు షేక్ ఖాలిక్, గుడివాడ సాంబశివరావు, ఈశ్వరప్రగడ రంగారావు, షేక్ జాఫర్, అచ్చి శ్రీకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి

జడ్జి శ్రీనివాసరావు



కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

నందిగామ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా స్వీకరించాలని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోర్టు భవనాల సముదాయంలో శనివారం న్యాయమూర్తులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనలను రక్షిస్తుందన్నారు. ముఖ్యంగా మొక్కలు పెంచడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పలు కోర్టుల న్యాయమూర్తులు వి.లక్ష్మీరాజ్యం, పి.తిరుమలరావు, ఎస్.కె రియాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండి మల్లికార్జునరావు, పి.ప్రకాష్, న్యాయవాదులు పి.ఎల్.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

-ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచే రానున్న ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం అందిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ఆర్ఎస్ గార్డెన్స్‌లో శనివారం రాత్రి నందిగామ పట్టణ గృహ సారథులు, బీఎల్ఏలు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని అందించిన పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహసారథులు, బీఎల్ఏలపై ఉందన్నారు. ఓటరు జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు డబుల్ ఎంట్రీ ఓటర్లు, మృతి చెందిన, స్థానికంగా నివాసముండని వారిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని జాతీయ స్థాయి సర్వేలన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెబుతున్నాయని చెప్పారు. గృహసారథులకు పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, పట్టణ సచివాలయ కన్వీనర్ మన్నం దాసు, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, నల్లమల్లి మురళి, ఎండీ అమీన్, యాకుబ్ అలీ, పలువురు నాయకులు, గృహసారథులు, బీఎల్ఏలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జై జై గణేశా.. బైబై గణేశా



పేటలోని పోలీస్ స్టేషన్‌లో పూజలు చేస్తున్న ఎస్ఐ రామారావు దంపతులు



నందిగామ మెయిన్ బజార్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



జుజ్జూరులో గణనాథునికి పూజలు చేస్తున్న మహిళలు



పేటలో నిమజ్జనానికి వెళుతున్న చింతావారి కాంప్లెక్స్‌లో గణేష్ విగ్రహం



వేదాద్రిలో నిమజ్జనానికి తరలివస్తున్న గణనాథుడు



పెనుగంచిప్రోలులో నిమజ్జన ఊరేగింపులో మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల్లో పూజలు, కొన్నిచోట్ల నిమజ్జనోత్సవాలు జరుగుతున్నాయి. జైజై గణేశా.. బైబై గణేశా అంటు భక్తులు కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పట్టణంలో శనివారం మండపాలలో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మండపంలో ఎస్ఐ బీవీ రామారావు దంపతులు పూజలు నిర్వహించారు. రైతుబజారు మండపంలో ఈవో కేవీ రమణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ పీఏలు సుధాకర్, శ్రీనివాసబాబు, ఎమ్మెల్యే ఉదయభాను వ్యక్తిగత కార్యదర్శులు అంజనీ ప్రసాద్, గోపి, నాగరాజు, పీఆర్‌వో సతీష్ పాల్గొన్నారు.

నిమజ్జనాల సందడి..

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు గణేష్ నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ కూడళ్లలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. స్థానిక కోదాడ రోడ్‌లోని చింతావారి కాంప్లెక్స్ వద్ద శ్రీగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం ఊరేగింపు మేళతాళాలతో పాటు యువకులు నృత్యాలు చేస్తూ అకర్షణగా నిలిచింది. పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపులో యువకులు, మహిళలు ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు. కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానది వద్ద శనివారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా జరుగుతున్నాయి. వినాయకుడి విగ్రహాలకు ఐదు రోజుల పూజల అనంతరం ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలిస్తున్నారు. కృష్ణా నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫంటు ద్వారా గణనాథులను కృష్ణమ్మ ఒడికి చేర్చారు. చిల్లకల్లు పోలీసులు నది వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

కంచికచర్ల: వినాయక చవితి సందర్భంగా శనివారం వినాయకుని విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పెట్రోలు బంక్ సెంటర్‌లో బాల వినాయక ఉత్సవ కమిటీ పూజలు చేశారు. లారీ యజమానుల సంఘ నాయకులు భారీ అన్న సమారాధన చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వాణిజ్య వర్తక సంఘ నాయకులు ఏర్పాటు చేసిన వినాయకునికి విశేష పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

వీరులపాడు: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని పెద్దాపురం, జయంతి, జుజ్జూరులతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, ఆలయాలలో కొలువుదీరిన గణనాథులకు శనివారం విశేష పూజలు చేశారు. జుజ్జూరు గ్రామంలోని రజక బజార్‌లో ఏర్పాటు చేసిన గణనాథునికి మహిళలు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారిని ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పలు మండపాల్లో సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. శివాలయం సెంటర్‌లో నిలిపిన గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. డౌన్ సెంటర్‌లో వినాయకుని మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ దుర్గాప్రసాద్ ప్రారంభించారు.

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం పలుచోట్ల గణపతి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని వాసవి మార్కెట్‌లో పలు హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. ముక్కోటి మండపంలోని పర్యావరణ గణపతి వద్ద స్వామివారికి విశేష పూజలు, ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. మెయిన్ బజార్ గణనాథుడి విగ్రహం వద్ద పలువురు వ్యాపారుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. రైతుపేటలోని శ్రీ హనుమాన్ టవర్స్‌లో పర్యావరణ గణపతి వద్ద హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

ఆరోగ్య మేళాను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పేటలో ఆయుష్మాన్ భవ విభాగాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ ద్వారా పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి (సామాజిక ఆరోగ్య కేంద్రం)లో వారానికి ఒక సారి ఆరోగ్య మేళా నిర్వహించి పేదలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డు సమస్యకు పరిష్కారం



రేషన్ కార్డు అందజేస్తున్న కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: సాంకేతిక కారణాల వలన గత మూడున్నరేళ్లుగా రేషన్ కార్డు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ చొరువతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్థానిక 5 వ వార్డుకు చెందిన రామిశెట్టి నాగరాజు గత మూడున్నరేళ్ల క్రితం రేషన్ కార్డు కోసం ధరఖాస్తు చేసుకున్నాడు. కానీ కొన్ని సాంకేతికపరమైన కారణాలతో వారికి రేషన్ కార్డు మంజూరు కాలేదు. ఈ విషయాన్ని బాధితుడు నాగరాజు వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపాడు. కౌన్సిలర్ మనోహర్ అధికారులతో చర్చించి శనివారం బాధితుడు నాగరాజు కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ మనోహర్ వలంటీర్‌తో కలిసి రేషన్ కార్డును అందజేశారు. కౌన్సిలర్‌కు నాగరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారులు హక్కులను తెలుసుకోవాలి



సదస్సులో పాల్గొన్న జడ్జి చిరంజీవి, అడ్వొకేట్ అయ్యప్ప తదితరులు

మైలవరం: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకుని, మోసాల నుంచి రక్షణ పొందాలని వినియోగదారుల కమిషన్-2 అధ్యక్షుడు, జడ్జి ఎస్.చిరంజీవి తెలిపారు. మైలవరం ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. జడ్జి చిరంజీవి మాట్లాడుతూ వినియోగదారులు ప్రతి ఒక్క వస్తువు కొనుగోలు చేసిన సమయంలో రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, సమాచార హక్కు చట్టం, పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జడ్జి చిరంజీవిని శాలువతో సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల కమిషన్ మెంబర్ రమణ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బి.దాసు, ఏపీ హైకోర్టు అడ్వొకేట్ బరిగే అయ్యప్ప, ఎస్ఎస్‌కే హైస్కూల్ ప్రిన్సిపాల్ జాన్ పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబేకాలనీకి చెందిన కలిశెట్టి సుధాకర్(42) అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్టు నున్న పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు వెల్డర్‌గా పని చేస్తున్న సుధాకర్‌కు 2010లో అనుషాతో వివాహమైంది. ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మనస్పర్ధల కారణంగా భార్యతో విడిపోయి వాంబేకాలనీలో ఎఫ్ బ్లాక్ -133లో ఉంటున్నాడు. అతని తల్లి రోజూ భోజనం తీసుకెళ్లేది. శనివారం భోజనం తీసుకెళ్లిన తల్లికి సుధాకర్ సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొన్నాడు. స్థానికుల సహకారంతో అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుని తమ్ముడు అనిల్‌కుమార్ ఫిర్యాదుతో పోలీసులు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేశారు.

దూర విద్యా కేంద్రం మంజూరు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దూరవిద్యా కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ బాబురావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ దూర విద్యా కేంద్రం స్థానిక లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు మంజూరైనట్లు దూరవిద్యా కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ బాబురావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఓపెన్ ఇంటర్ దూరవిద్యా కేంద్రం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ విద్యా విధానం ద్వారా వయస్సుతో నిమిత్తం లేకుండా 15 ఏళ్లు పూర్తి చేసుకొని, 10వ తరగతి పూర్తి చేసిన అందరూ ఇంటర్మీడియెట్ కోర్సు చదువుకునే అవకాశం ఉందన్నారు. కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, కరస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్, పాలకవర్గ సభ్యుడు జూటూరు అబ్బులు, అధ్యక్షుడు జల్లా తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



కంచికచర్ల : మండలంలోని మోగులూరు ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్కూల్‌ను ఎంఈఓ బీ బాలాజీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి ఎంఈఓ భోజనం చేశారు. తదుపరి పాఠశాలరి కార్డులు, విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో వినూత్న మార్పులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో అనేక మార్పులు రానున్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాఘవాచారి మీడియా అకాడమీ ఆధ్వర్యంలో డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సు చేస్తున్న విద్యార్థులకు, వర్కింగ్ జర్నలిస్టులకు శనివారం ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం జరిగింది. శ్రీనివాస రెడ్డి.. మాధ్యమాల అవసరాలు-కృత్రిమ మేధ (ఏ.ఐ) అనే అంశంపై మాట్లాడారు. చాట్ జీపీటీ, ఎడోబ్ పోడ్కాస్ట్, హ్యూమ్, క్యాన్‌వాస్, లెక్సికా ఆర్ట్, ప్యారట్, ఇండిజైన్, సెంటిషియా వంటి సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను ఉపయోగించుకుని మీడియా రంగంలో సులభంగా విధులను నిర్వహించవచ్చని చెప్పారు. గూగుల్‌లో ఈ టూల్స్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఏ అంశంపైనా పూర్తి సమాచారం కోసం చాట్ జీపీటీని ఉపయోగించి తెల్సుకోవచ్చునన్నారు. అవసరమైన ఫొటోల కోసం లెక్సికా ఆర్ట్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా తీసుకోవచ్చునన్నారు. వాయిస్ రికార్డ్‌లోని మాటలను ఏ భాషలోకి అయిన మార్చిడి చేసుకుని టైపింగ్ చేసే టూల్స్ కూడా గూగుల్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ టూల్స్ ఉపయోగించుకుంటే చాలా సులభంగా ఆన్‌లైన్ ఎడిషన్లను నిర్వహించవచ్చునని వివరించారు. ఈ టూల్స్‌పై ప్రత్యేక పుస్తకాన్ని కూడా రూపొందించానని శ్రీనివాసరెడ్డి చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ టూల్స్ గురించి ప్రాక్టికల్‌గా తెలియజేయడానికి జర్నలిస్ట్‌లకు త్వరలో వర్క్‌షాప్‌ను నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. జర్నలిజం డిప్లమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

శనగపాడు(పెనుగంచిప్రోలు): తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. గృహ సందర్శన ద్వారా తల్లులు, గర్భిణులు, చిన్నారులకు పలు అంశాలపై వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఇందిర మాట్లాడారు.



తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా చిల్లకల్లు ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీభార్గవి మాట్లాడుతూ పౌష్టికాహారంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత, డయేరియా వంటి వాటిపై అవగాహనతో పాటు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్ల ఏర్పాటు

కంచికచర్ల : కచ్చితమైన కొలుతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ పబ్బారి శంకర బాబు అన్నారు. మండలంలోని పేరకలపాడు, చెవిటికల్లు గ్రామాల్లో శనివారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, డీటీ నాగులక్ష్మీరా, మండల సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తి

నందిగామ: పట్టణంలోని సబ్ జైల్‌ను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రియాజ్ శనివారం సందర్శించారు. సబ్ జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు, న్యాయవాదులు కే మౌలేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్, కొండాపూర్ ప్రాంతానికి చెందిన బొర్రా సాంబశివరావు రూ.11,116లు ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ధర్మకర్త కోలా రామారావు చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

నందిగామ: స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల కాలభైరవుడి ఉపాలయంలో అష్టమి శనివారం నేపథ్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టమి నాడు కాలభైరవుడికి అభిషేకాలు నిర్వహిస్తే కష్టాలు తొలగుతాయని భక్తుల నమ్మకం . ఈ నేపథ్యంలో కాలభైరవుడికి జరిగిన ప్రత్యేక అభిషేకాల కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

పెద్దాపురం(వీరులపాడు): పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష, ఆయుష్మాన్ భవ కార్యక్రమాలపై శనివారం ఆమె అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. ముఖ్యంగా వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వం ప్రతత్యేకంగా అందించిన యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భవ కార్డుతో రూ.5 లక్షల వరకు ఆరోగ్య భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, పలువుర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

కొణకంచి(పెనుగంచిప్రోలు): వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కె.వాణి పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమం కింద గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, ఆయుర్వేద వైద్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మన చుట్టూ ఉన్న ఔషధ మొక్కలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

